http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 29 జూలై 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828


## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

- శాఖ మార్పునకు కేంద్రం ప్రతిపాదన
- ప్రచారాన్ని ఖండించిన బీజేపీ
- మొదట ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్చేందుకు కేంద్రం సిద్ధమైందని సమాచారం
- రాజీనామా తప్ప మరో ప్రత్యామ్నాయం అంగీకరించబోమన్న సీజేపీ ప్రతినిధులు
- ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇది
- ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదు



## 'పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

- ఆక్రమణలు, దారుణాల్ని కప్పిపుచ్చే డ్రామా'
- పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం
- పీఓకేలో స్థానిక సంస్థల ఎన్నికలు అక్రమ ఆక్రమణల్ని దాచే ప్రయత్నమేనని విదేశాంగ శాఖ విమర్శలు
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా పాక్ ఆక్రమించిన ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం



## రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ
# ఇబ్బందులు పడకూడదు




- సీడ్ కంపెనీలు గానీ, ఆర్గనైజర్లు గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదు
- పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులను వెంటనే ప్రారంభించి రైతులకు సకాలంలో అందేలా కార్యాచరణ చేపట్టాలి
- రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోదు



## ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

- ఆయనకు విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టడం దారుణం
- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ విమర్శ
- బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది.
- "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది
- దానిని నాశనం చేయడం పాపం
- ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే

## విద్యా హక్కులపై కేంద్రం ఆధిపత్యం
# సరికాదు

- ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది 'మా విచక్షణాధికారం'
- దానిని ఎవరూ లాక్కోలేరు: ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ విషయంలో హైకోర్టు ఉత్తర్వులను సమీక్షించి చట్టబద్ధంగా ముందుకెళ్తాం
- కోర్టుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటాం
- కబ్జాదారులే కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు
- దురుద్దేశపూర్వకంగా ధిక్కరణ కేసులు వేస్తున్నారు
- డబ్బులు ఖర్చు పెట్టి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు
- మేము తీసుకువచ్చిన అతి పెద్ద సంస్కరణ హైడ్రా



న్యూఢిల్లీ

ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వానికి ఉండే విచక్షణాధికారం. దానిని ఎవరూ లాక్కోలేరు. గతంలో సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై 400 కంటెంప్ట్ కేసులు ఉన్నాయి. న్యాయస్థానాలపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ విషయంలో హైకోర్టు ఉత్తర్వులను సమీక్షించి చట్టబద్ధంగా ముందుకు వెళ్తాం.. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత గొప్ప సంస్కరణ 'హైడ్రా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. - మిగతా3లో



## ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్
# చెల్లిస్తాం

- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపణ
- కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తామని వెల్లడి
- గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,, ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల సమస్యలు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్? చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. విద్య, వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. - మిగతా3లో



## బ్లాక్‌మెయిల్ కోసమే
# హైడ్రా

- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్
- హైడ్రా కమిషనర్‌గా ఏవీ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు
- హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
- కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న

హైదరాబాద్

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ - మిగతా3లో

## జనసంద్రమైన సింహాచలం..

- వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ
- ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం
- అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం
- 10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అయితే మొదట ధర్మేంద్ర ప్రధాన్? రాజీనామాకు కంటే ముందు ఆయనను వేరే శాఖకు మార్చాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో జరిపిన తొలి చర్చల్లో కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మాత్రమే మార్చే ప్రతిపాదనను చేసిందని సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు పూర్తిగా తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను బీజేపీ ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది.

ఈ అంశంపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇదన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని చెప్పారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు.

దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. సీజేపీ ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్? పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్?ను విద్యాశాఖ నుంచి మరో మంత్రిత్వ శాఖకు మార్చే అవకాశాన్ని ప్రభుత్వం ప్రతిపాందిచినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల ఆందోళనలు తగ్గుతాయని



కేంద్రం భావించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. విద్యాశాఖ నుంచి బదిలీ చేయడం సమస్యకు పరిష్కారం కాదని, మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవడమే ప్రజలకు సరైన సందేశమని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. ధర్మేంద్ర ప్రధాన్ ప్రభుత్వంలో కొనసాగితే ఉద్యమ లక్ష్యం నెరవేరదని, అందువల్ల రాజీనామా ఒక్కటే తమ డిమాండ్ అని చర్చల సందర్భంగా వెల్లడించినట్లు తెలిసింది.

**ఉద్యమకారుల్లో వ్యతిరేకత వస్తుందనే ఆందోళన**

చర్చల సందర్భంగా మంత్రివర్గంలో ఎవరు కొనసాగాలి? ఎవరికీ ఏ శాఖ కేటాయించాలన్నది పూర్తిగా ప్రధానమంత్రి అధికార పరిధిలోని అంశమని కేంద్ర ప్రతినిధులు సీజేపీకి వివరించినట్లు సమాచారం. అయినప్పటికీ, ఉద్యమకారులు తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పు చేయడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది. శాఖ మార్పు కంటే మంత్రి పదవి నుంచి తప్పుకోవడమే మేలని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. సీజేపీ చర్చల బృందం ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరిస్తే ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులు, మద్దతుదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశముందని వారు భావించినట్లు సమాచారం. అందుకే ఎలాంటి రాజీకి వెళ్లకుండా రాజీనామా డిమాండ్‌పైనే నిలబడినట్లు తెలుస్తోంది. ఉద్యమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గినట్లు సంకేతాలు వెళ్లకూడదనే ఉద్దేశంతో తమ వైఖరిని మార్చలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**రాజీనామా తర్వాత ముగిసిన ఆందోళన**

మూడో విడత చర్చలకు కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం సీజేపీ తమ నిరసన కార్యక్రమాలను విరమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గత కొన్ని వారాలుగా కొనసాగిన ఆందోళనలకు తాత్కాలికంగా తెరపడింది. రాజీనామా అనంతరం కేంద్ర ప్రభుత్వం, సీజేపీ మధ్య ఉద్రిక్తతలు కూడా తగ్గుముఖం పట్టాయి.

**రాహుల్ గాంధీ కూడా అదే డిమాండ్**

ఈ వివాదం సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మార్చే ప్రయత్నాలు కేంద్రం చేస్తోందని ప్రతిపక్షాలు కూడా విమర్శించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్పు సరిపోదని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలకు న్యాయం జరగాలంటే మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవాల్సిందేనని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. కేవలం శాఖను మార్చడం ద్వారా సమస్య ముగిసిపోదని, బాధ్యతను నిర్ధారించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలన్నింటితో కేంద్ర ప్రభుత్వం తొలుత శాఖ మార్పు ద్వారా వివాదాన్ని చల్లార్చే ప్రయత్నం చేసింది. కానీ సీజేపీ మాత్రం పట్టుబట్టడంతో రాజీనామా తప్పలేదు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (గ్రాశీఖ) జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు కావని, పాకిస్థాన్ తన అక్రమ ఆక్రమణల్ని ప్రపంచం నుంచి దాచిపెట్టేందుకు, దృష్టి మరల్చేందుకు ఆడుతున్న కపట నాటకమని భారత్ ఎండగట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ వైఖరి ఎప్పటికీ మారలేదని, అదే తమ విధానం అని పేర్కొన్నారు. పీఓకేలో ప్రజాస్వామ్యం అమలవుతోందనే భావన కల్పించడానికి మాత్రమే ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆ ప్రాంతంలో పాకిస్థాన్ అక్రమ ఆక్రమణ కొనసాగుతోందని, అక్కడి ప్రజలపై తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ దారుణాల నుంచి ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమే ఎన్నికల నిర్వహణ అని జైస్వాల్ విమర్శించారు.

'పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలు కూడా అక్కడి ప్రజల అసంతృప్తికి నిదర్శనం. పాకిస్థాన్ ఆర్థిక దోపిడీకి పాల్పడటం, ప్రజల ప్రాథమిక హక్కుల్ని కాలరాయడం, పరిపాలనా అణచివేత కారణంగానే ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. ఎన్నికల పేరుతో ఈ వాస్తవాల్ని ప్రపంచానికి కనిపించకుండా చేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది.'

**భారత నాగరిక వారసత్వంపై పాక్‌కు హక్కులేదు!**

ఈ సందర్భంగా మరోసారి సింధు జలాల ఒప్పందం అంశంపైనా స్పందించారు జైస్వాల్. ఉమ్మడి సింధు లోయ



నాగరికత తమది కూడా అని కొందరు పాకిస్థాన్ నిపుణులు చేస్తున్న వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు. దశాబ్దాలుగా సరిహద్దు బయట ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హింసకు మద్దతు ఇస్తున్న దేశానికి భారత నాగరిక, సాంస్కృతిక వారసత్వంపై హక్కు లేదని స్పష్టం చేశారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత్, సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.

దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలపైనా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్ దశాబ్దాలుగా భారత్‌పై సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని, ఆ దేశం వాస్తం స్వరూపం భారత యువతకు బాగా తెలుసని అన్నారు. భారత యువతతో పాటు కొత్త తరం కూడా పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా ముగింపు పలకాలని కోరుకుంటోందని ఆయన చెప్పారు. పాకిస్థాన్ ప్రజలు, అక్కడి నాయకత్వం కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని చురకలంటించారు.

**సార్క్ సహకారాన్ని అడ్డుకుంటుంది పాకిస్థానే!**

ఇదే సమయంలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడానికి పాకిస్థానే ప్రధాన కారణమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ప్రాంతీయ సహకారాన్ని భారత్ ఎప్పటి నుంచో సమర్థిస్తోందని, అయితే సార్క్ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్న దేశం ఏదో దక్షిణాసియాలోని ప్రతి ఒక్కరికీ తెలుసని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఇటీవల సార్క్‌ను తిరిగి చురుగ్గా మార్చాలని, సభ్య దేశాల మధ్య విభేదాల్ని చర్చల ద్వారా పరిష్కరించాలని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రణధీర్ జైస్వాల్ ఇలా అన్నారు. ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్ దశాబ్దాలుగా నిరంతర కృషి అందిస్తోందన్నారు. సార్క్‌లో భారత్, అఫ్గానిస్థాన్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, అభివృద్ధి సహకారాన్ని పెంచే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తుంది. 2014లో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో జరిగిన సార్క్ శిఖరాగ్ర సమావేశం తర్వాత ఈ సంస్థ కార్యకలాపాలు పెద్దగా ముందుకు సాగలేదు. 2016లో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ సదస్సు కూడా రద్దయింది. ఆ ఏడాది సెప్టెంబరులో జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో భారత సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ ఆ సమావేశానికి హాజరు కాలేమని ప్రకటించింది. తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్థాన్ కూడా ఇస్లామాబాద్ సమావేశాన్ని బహిష్కరించడంతో సదస్సు పూర్తిగా రద్దయింది.

# ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ తెలిపారు. అత్యాచార దోషులను సమర్థించే వ్యక్తి విద్యా శాఖ మంత్రిగా ఉండేందుకు ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు.

"విద్యావ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ యువత ఆందోళనలు చేపట్టారు. ఎంతో మంది యువతులు నిరసనల్లో పాల్గొన్నారు. కానీ, వారిని దారుణంగా కొట్టారు, చిత్రహింసలకు గురిచేశారు. బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది. అత్యాచార దోషులకు రక్షణ కల్పించాలనే వాడి కంటే నైతికత లేని వ్యక్తి మరొకరు ఉండరు. ఇప్పుడు అతనే దేశ విద్యాశాఖ మంత్రి. ఈ విషయంలో ప్రధాని స్పందన చాలా వింతగా ఉంది. ఆయన కేబినెట్‌లో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరికైనా ఈ పదవికి అప్పగించిఉండొచ్చు. కానీ ఆయన మాత్రం అత్యాచార దోషులను కాపాడే వ్యక్తినే ఎంచుకున్నారు."

ఇదిలా ఉండగా, పేపర్ లీక్, ఇతర అక్రమాలకు వ్యతిరేకంగా పరీక్షా విధానంలో తీసుకొచ్చిన కఠినమైన చట్టాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఇలాంటి వారిని మంత్రిని చేయడం సమాజంలో మహిళల భద్రతకు చాలా తప్పుడు సంకేతాలను పంపుతుందని ఆమె ఆరోపించారు. అయితే, లోక్?సభలో ప్రియాంక చేసిన వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందర



గోళం నెలకొంది. ప్రహ్లాద్ జోషికి సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని, తాను మాట్లాడిన ప్రతి మాటకూ కచ్చితమైన ఆధారాలు సమర్పిస్తానని ప్రియాంక స్పష్టం చేశారు.

**మన దేశ రాజ్యాంగం గొప్పది!**

అంతకుముందు, వేలాది మంది యువకులు తమ గళాన్ని వినిపించడానికి, ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరడానికి శాంతియుతంగా వీధుల్లోకి వచ్చారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని, కష్టపడటం కంటే నిజాయతీగా ఉండకపోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఉందని భావించడం మొదలుపెట్టారని ఆమె ఆరోపించారు. "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది. దానిని నాశనం చేయడం పాపం. ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనం. మనకు అధికారం ఇచ్చి ఇక్కడికి వచ్చాక, మనం చేసే ప్రతి పని వారి సంక్షేమం కోసమే ఉండాలనేది వారి ఏకైక ఆకాంక్ష. ఒకవేళ వారికి అన్యాయం జరిగితే, మనం వారికి జవాబుదారీగా ఉండి, వారికి న్యాయం జరిగేలా చూడాలి. కానీ, అలా జరగనందువల్లే ఇటీవలి రోజుల్లో వేలాది మంది యువకులు వీధుల్లోకి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

## జనసంద్రమైన సింహాచలం..

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

## ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌లకు కేంద్రం సమన్లు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, వినియోగదారుల గోప్యత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి దిగ్గజ సంస్థలకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 3న నిర్వహించనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరై, సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆదేశించింది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి టెక్ కంపెనీల ప్రతినిధులతో పాటు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు హోం మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరై కమిటీకి వివరాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. ప్రజల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, రైతుల సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారో వివరించాలని కంపెనీలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల పరీక్ష పత్రాల లీకేజీ, సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ కొద్దిసేపు తొలగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా వివరణ ఇచ్చింది. ఈ వివాదం మరియు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై విస్తృత చర్చ జరుగుతున్న తరుణంలో పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా..



అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హై-టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్‌ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్‌లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్‌ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.

## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# విద్యా హక్కులపై కేంద్రం ఆధిపత్యం సరికాదు

-మొదటిపేజీ తరువాయి

చెరువులు, కుంటలను కాపాడేందుకు చేపట్టిన ఈ వ్యవస్థను కొనసాగించి తీరతామని తేల్చి చెప్పారు. హైడ్రా విషయంలో కోర్టుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారే న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ దురుద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణ (కంటెంప్ట్) కేసులు వేస్తున్నారని సీఎం మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలోని కృషి భవన్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.



### ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా?

'చెరువులు, నాలాలను కాపాడటంలో హైడ్రా తన విధులు నిర్వర్తిస్తున్న తీరుపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉంది. ఎన్ కన్వెన్షన్, గండిపేట, బతుకమ్మ కుంటల్లో ఆక్రమణలు తొలగిస్తే అవి పేదలవంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? బతుకమ్మ కుంటను బీఆర్ఎస్ వాళ్లు కబ్జా పెట్టుకున్నారు. దానిపై కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసు వేశారు. కబ్జాదారులు డబ్బులు ఖర్చు పెట్టి సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. చెరువులను ఆక్రమించిన వారు ధనవంతులైనా, పేదలైనా చర్యలు తప్పవు.

### గత 12 ఏళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు..

'గడిచిన 12 ఏళ్లలో తెలంగాణకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదు. రాష్ట్రంలోని 11.56 లక్షల మంది అర్హులైన పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై (జీ)2.0) కింద ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశాం. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలోనే ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉపాధి హామీ నిధుల విడుదల, ఎల్ నినో వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర బృందాలను పంపాలని విజ్ఞప్తి చేశాం..' అని రేవంత్ తెలిపారు.

### విద్యా హక్కులపై కేంద్రం ఆధిపత్యం సరికాదు..

'పరీక్షల నిర్వహణ, లీకేజీల నిరోధానికి దేశస్థాయిలో పకడ్బందీ విధానం ఉండాలి. నిబంధనలు పట్టించుకోని కోచింగ్ సెంటర్లే ప్రశ్నపత్రాల లీకేజీలకు వేదికలుగా మారుతున్నాయి. విద్యకు సంబంధించి రాష్ట్రాల పరిధిలో ఉన్న అధికారాలను కేంద్రం లాక్కోవాలని చూడటం వల్లే గందరగోళం ఏర్పడుతోంది. నీట్ సహా ఇతర పరీక్షల విషయంలో యూనివర్సిటీలపై ఆధిపత్య ధోరణి వీడాలి. ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవు. ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయి. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సి ఉంది. సభలో చర్చ జరిగితే రాహుల్‌గాంధీ అన్ని అంశాలపై మాట్లాడతారు..' అని సీఎం అన్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పకడ్బందీ ప్రణాళిక

'గత కేసీఆర్ ప్రభుత్వం రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి పారిపోయింది. ప్రతి ఏటా రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్లు ఇందుకు అవసరమవుతాయి. ఇకపై ఏ సంవత్సరం బకాయిలు ఆ సంవత్సరమే చెల్లించేలా, అడ్వాన్స్‌గా బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో..కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య 100% ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో ఆ మేరకు డిమాండ్ చేస్తే బాగుంటుంది..' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, సురేష్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

# మా దగ్గర తీసుకున్న కమీషన్ ఇచ్చేయండి

ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చెల్లించిన అధికారులకు ఇప్పుడు కాంట్రాక్టర్లు ఝలక్ ఇస్తున్నారు. అవినీతి జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అడ్డదారిలో వెళ్లిన ప్రజా ధనాన్ని రికవరీ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. అయితే రెండో బిల్లులో తీసుకున్న 10 శాతం కమీషన్ డబ్బును అధికారులూ తిరిగివ్వాలని కాంట్రాక్టర్లు పట్టుబడుతున్నారు. అలాగే జీహెచ్?ఎంసీ అడుగుతున్న వడ్డీ డబ్బును చెల్లించలేమని చెబుతున్నారు.




### బల్దియా చరిత్రలో మొదటిసారి

కమీషన్, వడ్డీ డబ్బుతో కాంట్రాక్టర్లు రికవరీ ప్రక్రియపై మెలిక పెట్టడంతో శాఖాపరమైన చర్యల పేరుతో ఫైనాన్స్ విభాగం 78 మంది లైసెన్సులను హోల్డ్?లో పెట్టింది. ఆయా కాంట్రాక్టర్లకు ఇకపై జీహెచ్ఎంసీ ద్వారా బిల్లుల చెల్లింపు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంది. జీహెచ్?ఎంసీ చరిత్రలో ఇంత మంది కాంట్రాక్టర్లపై ఒకేసారి చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

### కమిషనర్ లేఖలతో

అనారోగ్యం, తమ పిల్లల వివాహం, ఇతరత్రా అత్యవసర కారణాలు చూపుతూ తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని అభ్యర్థిస్తూ కొందరు గుత్తేదారులు జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్??కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. దీంతో కొన్నింటిని కమిషనర్ పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో ఆయా గుత్తేదారులకే రెండుసార్లు వర్క్? బిల్లుల చెల్లింపు జరిగింది. దీనికి కారణం కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటమేనని తెలుస్తోంది.

ఏళ్లకు ఏళ్లుగా ఫైనాన్స్ విభాగంలో పని చేస్తోన్న పొరుగు సేవల సిబ్బంది కమిషనర్ సిఫార్సును సొమ్ము చేసుకున్నాడు. కమిషనర్ సిఫార్సు లేఖతో కాంట్రాక్టర్ బిల్లును చెల్లింపునకు పంపించి, ఆయా కాంట్రాక్టర్ల బిల్లులను వరుస క్రమంలోనూ కొనసాగించారు. ఫైనాన్స్ విభాగం సలహాదారు, అదనపు కమిషనర్, కమిషనర్ కూడా రెండు బిల్లులకు గుడ్డిగా ఆమోదం తెలిపారు. దాంతో ఒక్కో కాంట్రాక్టరుకు రెండుసార్లు నగదు ట్రాన్స్?ఫర్ అయ్యింది.

### మొత్తం ఆపరేటరే చేశాడు!

కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాలో రెండోసారి బిల్లుకు సంబంధించిన డబ్బులు జమ కాగానే కొందరు కాంట్రాక్టర్లు ఫైనాన్స్ విభాగానికి సమాచారం ఇచ్చారు. కానీ 10 శాతం కమీషన్ తీసుకున్న కంప్యూటర్ ఆపరేటర్, మీకేం కాదంటూ వారికి బదులు సమాధానం ఇచ్చాడు. అధికారులకు సైతం కమీషన్‌లో వాటాలు పంచాడు. ఈ విషయంలో చివరకు న్యాయపరమైన చిక్కులొస్తాయని కొందరు ఏడాది కిందటే బ్యాంకులో డబ్బు తిరిగి జమ చేయగా, సుమారు వంద మంది కాంట్రాక్టర్లు ఆపరేటర్ మాట విని అలాగే మౌనంగా ఉండిపోయారు.

### ఐటీ విభాగంతో బయటపడ్డ రెండు బిల్లుల కథ

ఇటీవల ఇన్?ఫర్?మేషన్ టెక్నాలజీ డిపార్ట్?మెంట్ అదనపు కమిషనర్ రాధికా గుప్తా మూడు కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలో ఇప్పటి వరకు చెల్లించిన బిల్లులను సరిచూడటంతో రెండు బిల్లుల కథ కదిలింది. దీంతో కంగుతిన్న ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. వడ్డీతో సహా రెండోసారి బ్యాంకులో పడిన డబ్బును తిరిగి చెల్లించాలని కాంట్రాక్టర్లకు సూచించగా, కొందరు అందుకు అంగీకరించారు. మరికొందరు తాము ఇచ్చిన కమీషన్ డబ్బును తిరిగివ్వాలని, కమీషన్ తీసుకున్న అధికారులను డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

# పెద్ది సుదర్శన్ రెడ్డి హెల్త్ బులిటెన్ విడుదల

# పరిస్థితి క్రిటికల్‌గా ఉందన్న యశోద వైద్యులు

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంకా వెంటిలేటర్?పై చికిత్స పొందుతున్నారు. ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్? నగరంలోని యశోద ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. పెద్ది ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆసుపత్రి వైద్యులు అధికారిక హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. తీవ్రమైన పల్మనరీ ఎంబోలిజం కారణంగా రక్తప్రసరణ వ్యవస్థ కుప్పకూలి షాక్‌కు గురైనట్లు వైద్యులు వెల్లడించారు. పరిస్థితి అత్యంత సున్నితంగా ఉండటంతో క్రిటికల్ కేర్, పల్మనరీ, కార్డియాక్, న్యూరాలజీ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యుల బృందం నిరంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం ఆయన పరిస్థితి క్రిటికల్‌గా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.



మెదడు పనితీరులో జరిగిన మార్పులు, నష్టాన్ని సూచించే సంకేతాలు ఈఈజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. సుదర్శన్ రెడ్డి న్యూరాలజికల్ పరిస్థితి, భవిష్యత్తు ఆరోగ్య స్థితిపై మరింత స్పష్టత కోసం 72 గంటల వ్యవధి తర్వాత మరోసారి ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నారు. యన ఆరోగ్య పరిస్థితిని యశోద ఆసుపత్రి నిపుణులైన వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తోంది.

### తొమ్మిదిసార్లు సీపీఆర్ తర్వాత

ఆదివారం ఉదయం 8:00 గంటలకు హన్మకొండలోని అడ్వకేట్స్ కాలనీలో ఉన్న తన నివాసంలో ఛాతీ నొప్పి రావడంతో, ఆయనను వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు చికిత్స అందించిన డాక్టర్ మమతా రెడ్డి, సుదర్శన్ రెడ్డి 'కార్డియాక్ అరెస్ట్'కు గురయ్యారని తెలిపారు. వైద్య సిబ్బంది ఒక గంట వ్యవధిలో తొమ్మిది సార్లు సీపీఆర్ నిర్వహించిన తర్వాత ఆయన గుండె మళ్లీ పనిచేయడం ప్రారంభించిందని చెప్పారు. ఆయనకు ఆంజియోగ్రామ్ పరీక్ష కూడా నిర్వహించారన్నారు. అనంతరం, వెంటిలేటర్‌పై ఉంచి, మెరుగైన చికిత్స కోసం మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.

ఆయన వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నాయకుడు హరీష్ రావు ఉన్నారు. పార్టీల అధినేత కేసీఆర్ నిన్న యశోదా ఆసుపత్రికి వచ్చి సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఇవాళ మంత్రి పొంగులేటి వచ్చి పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిన్న మంత్రి సీతక్క, పలువురు బీఆర్?ఎస్? నేతలు ఆసుపత్రికి వచ్చి పెద్ది ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదు




**హైదరాబాద్:** సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీడ్ కంపెనీల ప్రతినిధులు, సీడ్ కంపెనీ అసోసియేషన్ సభ్యులు, వివిధ జిల్లాల్లో పత్తి విత్తనోత్పత్తిలో భాగస్వాములైన ఆర్గనైజర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విజ్ఞప్తి మేరకు సీడ్ రైతులకు ఆర్గనైజర్ల ద్వారా జరగాల్సిన చెల్లింపులు, అలాగే ఆర్గనైజర్లకు సీడ్ కంపెనీలు చెల్లించాల్సిన బకాయిల అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలపై మంత్రి తుమ్మల సీడ్ కంపెనీల ప్రతినిధులను వివరణ కోరారు. దీనిపై స్పందించిన కంపెనీల ప్రతినిధులు గత సంవత్సరానికి సంబంధించిన బకాయిలన్నింటినీ ఈ ఏడాది ఆగస్టు నెలలోగా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే ఈ ఏడాది ప్రత్యేక పరిస్థితుల కారణంగా కంపెనీల వద్ద విత్తన నిల్వలు ఎక్కువగా ఉన్నాయని, ఆర్థిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ ఆర్గనైజర్లకు, రైతులకు చెల్లింపులు చేయడానికి కట్టుబడి ఉన్నామని వివరించారు. అవసరమైతే బ్యాంకుల నుంచి మార్టేజ్ రుణాలు తీసుకొని అయినా చెల్లింపులు చేస్తామని, ఈ సంవత్సరానికి సంబంధించిన చెల్లింపులను ఆగస్టు నుంచి ప్రారంభించి డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేస్తామని అన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీడ్ కంపెనీలు కేవలం లాభార్జన కోణంలో కాకుండా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్గనైజర్లకు, వారి ద్వారా రైతులకు చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీడ్ కంపెనీలు గానీ, ఆర్గనైజర్లు గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులను వెంటనే ప్రారంభించి రైతులకు సకాలంలో అందేలా కార్యాచరణ చేపట్టాలని కంపెనీలను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోదని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి, వ్యవసాయశాఖ డైరెక్టర్, సీడ్ కంపెనీ అసోసియేషన్ ప్రతినిధులు, పత్తి విత్తనోత్పత్తి కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

## ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం




-మొదటిపేజీ తరువాయి

విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందని, గ్లోబరీనా వంటి సంస్థలు నాడు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయని, నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారని, గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య ఉండదు

కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో చట్టాలు రూపొందిస్తామని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బకాయి పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు భారంగా మారిందని అన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ తాము ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఏపీలో రూ.10 వేల కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆర్.కృష్ణయ్య ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ రాష్ట్రంలో బకాయిలపై మాట్లాడరని సీఎం తెలిపారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, అక్కడ బకాయిలపై మాట్లాడాలని, ఏపీలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాక తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఏ ఏడాదికి సంబంధించిన బకాయిలు అదే ఏడాది చెల్లిస్తామని, ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రణాళికలు రచించామని, భవిష్యత్తులో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య తెలంగాణలో ఉండదని స్పష్టం చేశారు.

విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం. యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోంది. విద్య వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం.రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోంది రేవంత్ రెడ్డి, సీఎం

# ప్రభుత్వ ఆసుపత్రిలో విలువైన సేవలు





**2 సంవత్సరాల కాలంలో రెండు వేల పై చిలుకు అర్థో సర్జరీలు..**
**రికార్డు స్థాయిలో 5 వేల డెలివరీలు..**
**ప్రజల చూపు ప్రభుత్వ దవాఖాన వైపు..**
**రూ.51 కోట్లతో 50 పడకల నుండి 100 పడకలకు ఆధునీకరణ..**
**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు**
**చింతకుంట విజయరమణ రావు..**

**అగ్నిధారన్యూస్( పెద్దపల్లిజిల్లా ) జూలై 28:**

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ...**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి నేటి వరకు రూ. 131కోట్ల విలువైన వైద్య సేవలను అందించడం జరిగిందని అన్నారు. ఆసుపత్రికి సంబందించి రూ.40 లక్షల రూపాయల వ్యయంతో వివిధ విభాగాలకు సంబందించి అత్యధునిక సామాగ్రిని వైద్య సేవల కోసం అందజేయడం జరిగింది. కంటి శుక్లలు ముందు వెనుక భాగాలు పరీక్షించే అత్యధునిక పరికరాలు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని కొలిచే పరికరాలు,పంటి రూట్ కెనాల్ చేసే అత్యధునిక పరికరాలు,మోకాళ్ళ కీళ్ల మార్పిడి తొడ ఎముక కాలి ఎముక పరికరాలు, ఆపరేషన్లో ఉపయోగపడే ఆత్యాధునికమైన ఎక్రేస్ ఇమేజింగ్ పరికరాలు, నడుము మెడ నొప్పులను తగ్గించే అత్యధికమైన పరికరాలు మోకాలు గుజ్జు అరగకుండా కండరాలు బ్రీత్ తగ్గించే పరికరాలు, చెవి వినికిడి సామర్థ్యం లెక్కించే యంత్రం చెవి ముక్కు గొంతు లోపలి భాగాలను పరీక్షించే యంత్రాలతో పాటు చర్మ వ్యాధులను పరీక్షించే అత్యాధునికమైన డేర్మ చైర్ అన్ని రకాల పరికరాలు చిన్న చిన్న పులిపిర్లు తొలగించే కాటన్ యంత్రం అన్ని రకాల యంత్రాలను ?40 లక్షల రూపాయల నిధులతో ఆసుపత్రిలో సమకూర్చడం జరిగింది అని అన్నారు. సంవత్సర కాలం నుండి దాదాపు 50 లక్షల రూపాయల వ్యయంతో 10 వార్మర్లు, 7 ఫోటో థెరపీ యూనిట్లు, 2 సిపాపు,1 వెంటిలేటుతో ఎస్ ఎన్ సి యు ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈరోజు వరకు 990 మంది నవజాత శిశువులకు సంవత్సర కాలంలో దాదాపు 9 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేసి వైద్య సేవలు అందించడం జరిగిందని అన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ సహకారంతో నవజాత శిశు వుల సేవలు అందించడం కోసం కరీంనగర్ లో 3 నెలల పాటు కొంతమంది స్టాఫ్ కి శిక్షణ ఇప్పిచ్చి సంవత్సరం కాలం నుండి జీతాలు ఇస్తూ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ఆసుపత్రికి 20 లక్షల రూపాయల వ్యయంతో నూతన ఆంబులెన్స్ ను అందించిన అందించడం జరిగింది. అదేవిధంగా రెండు సంవత్సరాల కాలంలో దాదాపు 2081 మందికి ఆర్థో సర్జరీలు చేయడం జరిగింది దాదాపు 10 కోట్ల 40 లక్షల 50 వేల రూపాయల వరకు ఈ రెండు సంవత్సరాలల్లో ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా వైద్యసేవలు అందజేయడం జరిగింది. అదేవిధంగా దాదాపు 6478 మందికి జనరల్ సర్జరీలు చేయడమైనది దాదాపు 32 కోట్ల 38 లక్షల 50 వేల రూపాయల వరకు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సర కాలంలో దంతా వైద్యనికి సంబందించి దాదాపు 216 కి సర్జరీలు చేయడం జరిగింది. 21లక్షల 60 వేల వరకు ఖర్చు చేయడమైనది. దాదాపు 3096 కటారక్ సర్జరీలు జరుగుతే సుమారు 94 లక్షల 98 వేల రూపాయలు వరకు ఖర్చు చేయడం జరిగింది. దాదాపు 1000 విలువ గల యు జి ఎస్ స్కానింగ్లు 40,923 జరిగాయి సుమారు 4 కోట్ల 9 లక్షల 20 వేల వరకు ఖర్చు చేయడం జరిగింది. దాదాపు 2355 మందికి టూడికో పరీక్షలు చేయడం జరిగింది సుమారు 47 లక్షల 10 వేల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది అని అన్నారు. దాదాపు 32 వేల 38 మందికి ఈసీజీ పరీక్షలు చేయడం జరిగింది సుమారు కోటి 13 లక్షల పై చిలుకు ఖర్చు చేయడం జరిగింది. మన ఆసుపత్రి సంబందించి దాదాపు ల్యాబ్ టెస్ట్ లు చర్మ ఓపీ గాని ఫిజియో థెరఫీ గాని అలాగే దాదాపు 5067 డెలివరీలు చేయడం జరిగింది. 25 కోట్ల 33 లక్షల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. జిల్లా ఆసుపత్రిలో 1 లక్ష విలువ చేసే ల్యాప్కో స్కోపి 24 సర్జరీలు, 2 లక్షల వీలువ చేసే 3 ఆర్తోస్కోప్ సర్జరీలు , 1 లక్ష వీలువ చేసే 3 యూరాలజీ సర్జరీలు చేయడం జరిగింది 33 లక్ష రూపాయలు ఖర్చు చేయడం జరిగింది అన్నారు. రెండున్నర సంవత్సరాలలో 5 లక్షల 12 వేల 290 మందికి మందులు ఇవ్వడం జరిగింది సుమారు దీని విలువ 25 కోట్ల 60 లక్షల 45 వేల రూపాయలు అని తెలిపారు. ఆసుపత్రి రెండు సంవత్సరాల్లో మొత్తం 131 కోట్ల 62 లక్షల 68 వేల రూపాయలు పేద ప్రజానీకనికి ప్రభుత్వం ఆసుపత్రి ద్వారా ఖర్చు చేయడం జరిగింది అన్నారు . రెండు సంవత్సరాలకు ముందు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ఆరోగ్యకరంగా పేషెంట్లు వస్తే సరైన వైద్య సేవలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా మంత్రి శ్రీధర్ బాబు వారందరి సహకారంతో ఆస్పత్రిని అభివృద్ధి చేసుకోవడం జరిగింది అన్నారు. గత పది సంవత్సరాల్లో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని కనీసం మాత్రంగా పట్టించుకోకుండా వైద్య సేవలు అందించకుండా నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఇప్పుడు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలలో నంబర్ వన్ స్థానం రావడానికి కృషి చేసిన ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ ,ఆర్ఎమ్ఓ,హాస్పిటల్ సిబ్బంది కి ఘనత దక్కుతుందని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే పెద్దపల్లి ఆసుపత్రి ఇంత మంచి వైద్య సేవలు అందించడానికి మొదటి స్థానం రావడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష కి కృతజ్ఞతలు తెలిపారు. 50 పడకల నుండి 100 పడకలకు ఆధునీకరణ కోసం రూ. 52 కోట్లు మంజూరు చేయడం జరిగిందని రాబోయే జనవరి నుండి ఫిబ్రవరి వరకు కొత్త హాస్పిటల్ ప్రారంభించడం జరుగుతుంది అని తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సీఎం కార్యాలయం నుండి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కార్యాలయం నుండి మన ప్రభుత్వాసుపత్రిలో జరిగే సర్జరీలు వైద్య సేవలు గురించి రోజువారిగా రిపోర్టు ఇవ్వాలని కోరారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, జిల్లా గ్రంధాలయం చెర్మన్ అన్నయ్య గౌడ్,పెద్దపల్లి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు, నూగిళ్ళ మల్లయ్య, బిరుదు రాధాకృష్ణ, పట్టణ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిరసనలకు 'సుప్రీం' ఛత్రం!

ఉద్యమించటం, నిరసనలు వ్యక్తం చేయటం నేరమన్న అభిప్రాయం వ్యవస్థల్లో నరనరానా వ్యాపించింది. ఒక బ్యానర్‌తోనో, ఒక జెండాతోనో, నిర్దిష్టమైన ఎజెండాతోనో జనం రోడ్లపైకి రాగానే లాఠీలు పైకి లేపడం, బాష్పవాయు గోళాలు వర్షించడం... ఉద్యమకారుల్ని ఈడ్చుకెళ్లడం, పిడిగుద్దులు, బూటుకాళ్లతో తన్నడాలు రివాజయ్యాయి. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఉద్యమంలోనైతే పెల్లెట్లనుంచి ఏకే--47 బుల్లెట్ల వరకూ కనబడటం అందరినీ దిగ్భ్రాంతిపరిచింది. ఈ నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం శాంతియుత నిరసనలపట్ల ఎలా వ్యవహరించాలో తెలియజేస్తూ మార్గదర్శ కాలు జారీచేస్తామనటం స్వాగతించదగింది. నిరసనలు రాజ్యాంగం ప్రసాదించిన హక్కనీ, వాటిని నిరాకరించటం సరికాదనీ వ్యాఖ్యానించింది. పాలకులూ, వారిని సమర్థించే కొన్ని వర్గాలూ ఈ సంగతి మరిచి చాన్నాళ్లయింది. ఉద్యమాలూ, నిరసనలను ఏవగించుకునే జాతీయ మీడియా చానెళ్లకు కూడా కొదవలేదు.



దగ్గర వాటర్ బాటిళ్లు తప్ప మరేం లేని 15, 16 ఏళ్ల పిల్లల్ని... అందునా ఆడపిల్లల్ని గూండాలుగా అభివర్ణించే స్థాయికి అవి దిగజారాయి. ఆడపిల్లల ఛాతీపై చేతులువేసి నెట్టడం, చెంపదెబ్బలు కొట్టడం, లాఠీలతో మోదటం ఏ రకంగా సమర్థనీయం? వారు కనీసం ప్రతిఘటించే ప్రయత్నం కూడా చేయలేదే! విధి నిర్వహణలోవున్న పాత్రికేయుల్నీ, పక్కన నిలబడి చూస్తున్నవారినీ కూడా తలలు పగలగొట్టారు. పెల్లెట్లతో గాయపరిచారు. ఇలా అతిగా ప్రవర్తించిన సిబ్బంది మాస్కులు, స్వెట్టర్లు ధరించి వివరాలు తెలియకుండా జాగ్రత్త పడ్డారు. డీకే బసు వర్సెస్ పశ్చిమ బెంగాల్ కేసులో వెలువరించిన తీర్పులో చట్టబద్ధమైన విధి నిర్వహణలో ఉండే ప్రతి పోలీసు అధికారి తప్పనిసరిగా తమ గుర్తింపు తెలిసేలా ఉండాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. అటుపై అది సీఆర్‌పీసీలో 41--బి సెక్షన్‌గా, ఇప్పుడు బీఎన్ఎస్‌లో సెక్షన్--36గా చేరింది. బలప్రయోగం చేయటానికి రాజ్యానికున్న అధికారం తాలూకు బాధ్యతను నిర్దిష్టంగా గుర్తించదగిన వ్యక్తికి ఆపాదించగలిగేలా ఉండాలన్న రాజ్యాంగపరమైన హామీ ఇది.

పెద్దయెత్తున జనం పాల్గొనే ఆందోళనల్లో నేరగాళ్లు చొరబడే అవకాశాలు లేకపోలేదు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశాలు తోసిపుచ్చలేం. అలాంటివారిని గుర్తించి అదుపు చేయటానికే సాధారణ దుస్తుల్లో పోలీసు సిబ్బంది ఉంటారు. అంతకన్నా ముందు నిరసన జరిగే ప్రాంతాన్ని నిరంతరం నిఘా కళ్లు చూస్తుంటాయి. అలాంటపుడు ఊరేగింపు జరపాలని సీజేపీ నిర్ణయించిన రోజు వేకువజామున జంతర్‌మంతర్‌లో పెద్ద పెద్ద రాళ్లతో కూడిన ట్రక్కు, అప్పటికే పూర్తిగా ధ్వంసమైన వాహనం ఎలా చేరాయి? అప్రమత్తంగా ఉన్న కార్యకర్తలు వెనువెంటనే వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. అప్పుడైనా చర్యలుంటే పోలీసులపై జరిగాయంటున్న దాడులకు ఆస్కారం ఉండేది కాదు. కానీ అటుతర్వాత విచక్షణారహితంగా ఉద్యమకారుల్ని కొట్టారు. తలలకు గాయాలై నెత్తురోడుతున్నవారు అనేకమంది వీడియోల్లో కనబడ్డారు. కొందరికి చేతులు విరిగాయి. లాఠీచార్జి చేసేటపుడు మోకాలు దాటి పై భాగంలో కొట్టడం చట్టవిరుద్ధం.

ఈ నెల 25న బిహార్ బంద్ సందర్భంగా శివాన్ జిల్లాలో ఉద్యమకారులతో ఘర్షణ చోటుచేసుకున్నప్పుడు ఒక కానిస్టేబుల్ ఏకే--47తో కాల్పులు జరుపుతూ కెమెరాలకు చిక్కాడు. 15 యేళ్ల బాలుడితోసహా ముగ్గురు గాయపడ్డారని అంటున్నా పోలీసులు మాత్రం ఆ కాల్పులవల్ల ఎవరూ గాయపడలేదంటున్నారు. నిరాయుధ పౌరులపై మిలిటరీ గ్రేడ్ ఆయుధాలు ఉపయోగించరాదన్న ప్రాథమిక పరిజ్ఞానం కూడా అతగాడికి లేదని అర్థమవుతుంది. అతన్ని సస్పెండ్ చేశారు సరేగానీ... కనీస అవగాహన లేనివారికి ఇటువంటి ప్రమాదకర ఆయుధాలు ఎలా ఇచ్చారన్నది తేల్చాలి. మొన్న శుక్రవారం విజయవాడలో విద్యార్థి, యువజన సంఘాల 'చలో లోక్‌భవన్'లో సైతం ఇలాంటి దృశ్యాలే దర్శనమిచ్చాయి. ఏపీలో అమలయ్యేది రెడ్ బుక్ రాజ్యాంగం కనుక విద్యార్థి సంఘాల కండువాలేసుకుని మరీ పోలీసులు దాడిచేశారు. యువకుల్ని బూటుకాళ్లతో తన్ని, పిడిగుద్దులు గుద్ది తీవ్రంగా గాయపరిచారు. రోడ్డుపై పడేసి కొట్టారు. ఇలా ఆటవిక ప్రవృత్తి మితిమీరుతున్న దశలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవటం శుభ పరిణామం.

# అమెరికా అమిత్ర వైఖరి

ఒకసారంటూ పొరపొచ్చాలు వచ్చాక ఎంత సన్నిహిత మిత్రుల మధ్యనైనా తిరిగి సాధారణ సంబంధాలు ఏర్పడటం అంత సులభం కాదు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ--7 దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య బుధవారం జరిగిన ద్వైపాక్షిక సమావేశం తీరుతెన్నులు గమనిస్తే ఈ సంగతి సులభంగా అర్థమవుతుంది. ట్రంప్ గత 16 నెలలుగా అనుసరిస్తున్న అమిత్ర వైఖరి ఇందుకు కారణం. మిత్ర దేశాలని లేదు, ప్రత్యర్థి దేశాలని లేదు -- అందరినీ ఒకే గాటన కడుతూ, ఒక దేశాధినేతకు ఉండాల్సిన కనీస ఔచిత్యాన్ని మరిచి ఇష్టానుసారం మాట్లా డటం ఆయనకు అలవాటుగా మారింది. అంతేకాదు -- ఎడాపెడా అధిక సుంకాలు విధించటం, తమ సరుకుపై సుంకాలు తగ్గించాలని కోరడం వంటివి మన దేశాన్ని చీకాకు పరి చాయి. ఇలాంట చేదు అనుభవాలు ఎన్ని ఎదురైనా మన దేశం సంయమనం పాటించింది. నిజానికి మొన్న భారత నావికులు ముగ్గుర్ని హార్మూజ్ జలసంధి వద్ద హత్య చేసిన ఉదంతంతోసహా ఈ 16 నెలల పొడవునా మన దేశం పరుషంగా మాట్లాడింది ఎప్పుడూ లేదు. నోబెల్ శాంతి బహుమతి యావలో భారత్--పాక్ యుద్ధాన్ని తానే ఆపాననీ, ఇద్ద రినీ తీవ్రంగా బెదిరించాననీ మాట్లాడినప్పుడు అందులో ఏమాత్రం నిజం లేదని మన దేశం చెప్పింది. ఆయన ఇలా డప్పుకొట్టుకుంటున్నప్పుడల్లా మొదట్లో ఖండిస్తూనేవచ్చింది.

## రిజర్వేషన్లు రద్దు కాదు... అసమానతలు రద్దు కావాలి!




**సమాన అవకాశాలు కల్పించేందుకే రాజ్యాంగంలో రిజర్వేషన్లు**
**సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్**
**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

రిజర్వేషన్లను రద్దు చేయాలనే నినాదాలు చేయడం దేశంలో నెలకొన్న సామాజిక వాస్తవాలను విస్మరించడమేనని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. రిజర్వేషన్ల అవసరం లేకుంటే దేశంలో ప్రతి సంవత్సరం కొత్త కొత్త సామాజిక వర్గాలు రిజర్వేషన్ల కోసం ఎందుకు ఉద్యమాలు చేస్తున్నాయో ఆలోచించాలని ఆయన ప్రశ్నించారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రిజర్వేషన్లు కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీలకే పరిమితం కాలేదని, 2019లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కూడా 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రిజర్వేషన్ల అవసరాన్ని భారత పార్లమెంటే గుర్తించిందన్నారు. అదే సమయంలో పలు సామాజిక వర్గాలు తమకు మరిన్ని రిజర్వేషన్లు కల్పించాలని, మరికొన్ని వర్గాలు తమను ఎస్టీ లేదా ఇతర జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేస్తుండటం దేశంలో సామాజిక, విద్యాపరమైన అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రిజర్వేషన్లను ఉద్యోగాల పంపిణీ పథకంగా కాకుండా, శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే రాజ్యాంగ సాధనంగా రూపొందించారని డా. నగేష్ అన్నారు. సామాజిక ప్రజాస్వామ్యం అంటే అందరికీ సమాన గౌరవం, సమాన అవకాశాలు, విద్య, ఉపాధి, అభివృద్ధిలో సమాన భాగస్వామ్యం కల్పించడమేనని పేర్కొన్నారు."మెరిట్ గురించి మాట్లాడే ముందు అందరికీ ఒకే ప్రారంభ అవకాశం ఉందా అనే ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఒకరిని కొండపై నిలబెట్టి, మరొకరిని లోయలో నిలబెట్టి ఇద్దరూ ఒకేసారి పరిగెత్తాలని చెప్పడం న్యాయం కాదు. అందుకే రాజ్యాంగం రిజర్వేషన్లను సమాన అవకాశాల సాధనంగా తీసుకొచ్చింది" అని ఆయన వ్యాఖ్యానించారు.రిజర్వేషన్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని ఎవరైనా భావిస్తే, వాటిని సరిదిద్దే విధానాలపై చర్చ జరగాలని, అదే సామాజిక వర్గంలో ఇప్పటికీ అవకాశాలు అందని పేద కుటుంబాలకు రిజర్వేషన్ ప్రయోజనాలు మరింత విస్తరించేలా సంస్కరణలు తీసుకురావాలని ప్రభుత్వాలను కోరాలని సూచించారు. రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్ సమస్యకు పరిష్కారం కాదని, అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.దేశంలో కుల వివక్ష, సామాజిక అన్యాయం, అవకాశాల్లో అసమానతలు పూర్తిగా తొలగిన రోజునే రిజర్వేషన్ల అవసరంపై సహజంగానే కొత్త చర్చ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అంతవరకు రిజర్వేషన్లను వ్యతిరేకించే బదులు అసమానతలను నిర్మూలించే పోరాటాన్ని బలోపేతం చేయాలని డా. మార్షల్ దుర్గం నగేష్ పిలుపునిచ్చారు.

## వైసీపీ సీనియర్లలో అసంతృప్తులు

**నెల్లూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ఆ పార్టీ సీనియర్లలో ఆందోళన అదే. ప్రజా పోరాటాలు చేయడం లేదు. ప్రజా ఆందోళనలు నిర్వహించడం లేదు.. జాతీయస్థాయిలో జరుగుతున్న పెద్ద ఉద్యమాలకు మద్దతు తెలపడం లేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చుట్టూ వివాదాలు, కేసులు నడుస్తున్నాయి. అలాగని గత ప్రభుత్వ హయాంలో జరిగిన కేసులు కావు. ఇందులో నేరుగా కూటమి ప్రభుత్వం కలుగజేసుకోవడం లేదు. కానీ ఒక్క వైసీపీ నేతపై కేసు నమోదు అవుతుంది. అరెస్టుల పర్వం నడుస్తోంది. దీనిపైనే వైసీపీలో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగత వ్యవహార శైలితో పార్టీని కొంతమంది నేతలు డ్యామేజ్ చేస్తున్నారన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఇది పార్టీ పై ప్రతికూలత చూపుతోందన్న ఆవేదన సీనియర్లలో ఉంది. ఇన్ని రోజులు అధినేత జగన్మోహన్ రెడ్డి ఏం చేసినా ఊరుకున్నామని.. ఇకనుంచి ఊరుకోబోమని వారు చెబుతున్నారు. హెచ్చరించినంత పని చేస్తున్నారు.కొద్ది రోజుల కిందట సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పార్టీలోనే పవర్ఫుల్ నేత ఆయన. మరి ఎందుకు ఆ స్థాయిలో మాట్లాడడం లేదు అని రిపోర్టర్ ప్రశ్నించేసరికి పెద్దిరెడ్డి వింత సమాధానం చెప్పారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదనతో సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తాను అటువంటిదే కోరుకుంటానని.. తమ పార్టీ నేత అంబటి రాంబాబు లా మాట్లాడను అంటూ చురకలు అంటించారు. అయితే అది అంబటి రాంబాబు నువ్వు ఉద్దేశించింది కాదు. తెర వెనుక జగన్ వైఖరిని తప్పు పట్టడమే దాని ముఖ్య ఉద్దేశం. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే కాదు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు లాంటి సీనియర్ నేతలు వైసీపీలో అనవసర వ్యాఖ్యలు చేసే నాయకుల వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది.మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం పాత కేసులను తెరపైకి తెచ్చి వెంటాడింది అని వైసిపి ఆరోపించింది. కానీ ఇప్పుడు ఒక్కో నేత అరెస్టు తీరు చూస్తే మాత్రం భిన్నంగా ఉంది. కేసులు నమోదు కావడం వెనుక చూస్తుంటే వ్యక్తిగత వ్యవహార శైలి కనిపిస్తోంది. మాజీ మంత్రి అప్పలరాజు వ్యవహరించిన తీరుతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. తన కుమారుడు బైక్ రైటింగ్ కారణంగా ఓ మనిషి ప్రమాదానికి గురయ్యారు. కానీ అది తన కొడుకు మెడకు చుట్టుకోకుండా మరో వ్యక్తిని బలిపశువు చేయడానికి చూశారు. దానిని కూడా సక్రమంగా హ్యాండిల్ చేయలేకపోయారు. చివరకు ఆయన అరెస్టు కూడా జరిగిపోయింది. పార్టీకి డ్యామేజ్ మిగిల్చింది. తమ్మినేని సీతారాం గురించి అయితే చెప్పనవసరం లేదు. స్పీకర్ గా ఉంటూనే ఒక భూమి యజమాని బతికుండగానే ఆయన వారసుల పేరుతో నకిలీ ధ్రుపత్రాలు సృష్టించి.. తన కుమారుడి పేరుతో నాలుగు కోట్ల విలువైన భూమిని రాయించుకున్నారు.. సామాన్యులు సైతం దీనిని తప్పుపడుతున్నారు.తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. జోగి రమేష్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులు 11 మందిపై కోడలు మేఘన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం, గృహహింస, హత్యాయత్నం వంటి ఆరోపణలు చేస్తూ ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీంతో జోగి రమేష్ ఫ్యామిలీ కేసుల బారిన పడింది. వీటిని రాజకీయ కక్ష్యలో చూపించే ప్రయత్నం జరుగుతోంది. కానీ ఇది వ్యక్తిగత కేసులు అన్నది ప్రజలకు తెలుసు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజా పోరాటాలు చెయ్యకపోగా ఇలా వ్యక్తిగత వైఖరితో పార్టీని డ్యామేజ్ చేస్తున్నారు అనేది సీనియర్ల అభిప్రాయం. అంతకుమించి జగన్ వారిని వెనుకేసుకు రావడం పై కూడా పార్టీలో భిన్న స్వరం వినిపిస్తోంది. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

## ఫ్లై ఓవర్ల కింద విద్యుద్ సబ్ స్టేషన్లు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఫ్లై ఓవర్స్ కింద ఉన్న ఖాళీ స్థలాలలో సబ్ స్టేషన్ నిర్మాణాలను చేపట్టనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ ఱ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఎస్పీడీసీఎల్ ఇంజనీర్లు ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. హైదరాబాద్ వీఎస్టీ స్టీల్ బ్రిడ్జ్ కింద ఏర్పాటు చేయనున్న సబ్ స్టేషన్ స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఛైర్మెన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫ్లై ఓవర్స్ స్ట్రక్చర్ కు ఎలాంటి హాని కలుగకుండా సబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతామన్నారు. వీటి నిర్మాణాల వల్ల ఉన్న సబ్ స్టేషన్ లపై లోడ్ తగ్గడంతో పాటు , కొత్త కనెక్షన్ లకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నగరంలో ఐదు చోట్ల ఫ్లై ఓవర్ కింద స్థలాలను గుర్తించామని , త్వరలో అక్కడ సబ్ స్టేషన్ నిర్మాణం చేపడతామని ఆయన వివరించారు.

# హమాలీలను బద్నాం చేయొద్దు.. కూలీ రేట్లు పెంచాలి

**లేకుంటే ఆందోళనలు తప్పవు:**
**హమాలీ వర్కర్స్ యూనియన్ హెచ్చరిక**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచకుండా హోల్‌సేల్ వ్యాపారులు రైతులు, ఆసాములను రెచ్చగొట్టి హమాలీలను బద్నాం చేయడం మానుకోవాలని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ గోదావరిఖని మార్కెట్ అధ్యక్షుడు ఎం.ఏ. గౌస్ డిమాండ్ చేశారు.మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 40 ఏళ్లుగా హమాలీల కూలీ రేట్ల పెంపు సహా ఇతర సమస్యలపై హోల్‌సేల్ వ్యాపారులతో చర్చించి పరస్పర అంగీకారంతో నిర్ణయాలు తీసుకునే సంప్రదాయం కొనసాగుతుందని తెలిపారు. అయితే ప్రస్తుతం అమలులో ఉన్న కూలీ రేట్లు పెరిగిన ధరలకు ఏమాత్రం అనుగుణంగా లేవని, 2019లో



నిర్ణయించిన రేట్లనే ఇప్పటికీ కొనసాగించడం వల్ల హమాలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత ఐదేళ్లుగా పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా హోల్‌సేల్ వ్యాపారులు కూలీ రేట్ల పెంపుపై స్పందించలేదని విమర్శించారు. దీనికి బదులుగా రైతులు, ఆసాములను హమాలీలపై రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. హమాలీలు రైతుల వద్ద కూరగాయలను ఎత్తుకుపోతున్నారనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు.హోల్‌సేల్ వ్యాపారులు తమ వైఖరిని మార్చుకుని వెంటనే హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని, లేనిపక్షంలో కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీ మియా, గాలిపెల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మంత్రులు, ఎంపీలకు వినతి

**అగ్నిధార న్యూస్ మహబూబ్ నగర్, జూలై 28**

దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర, మహబూబ్ నగర్ జిల్లా నాయకులు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్ తదితరులు మంగళవారం కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో రద్దు చేసిన దేశవ్యాప్తంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను వెంటనే





పునరుద్ధరించాలని కోరారు. అలాగే రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం అమలు చేయడంతో పాటు, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని పార్లమెంట్‌లో తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంఘాలకు, సొసైటీలకు ప్రభుత్వ స్థలాల కేటాయింపుపై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించి, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయాలు తీసుకునేలా కృషి చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, పర్కాల సమ్మయ్య గౌడ్, కె. రమాదేవి, పద్మనాభరావు, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సమ్మె నోటీసుపై రెండో విడత చర్చలు

**మెడికల్ బోర్డుపై రీ-పరీక్షలను పరిశీలించాలి: ఆర్ఎల్‌సీ**
**ఆగస్టు 6లోగా డిమాండ్లపై నివేదిక ఇవ్వాలని యాజమాన్యానికి ఆదేశం**

**అగ్నిధార న్యూస్ (రామగుండం):**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై కేంద్ర కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డా. సస్వతీ రాథ్ సమక్షంలో మంగళవారం రెండో విడత చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో సింగరేణి యాజమాన్యం తరఫున డిప్యూటీ జనరల్ మేనేజర్ బి. రాజగోపాల్ పాల్గొనగా, ఏఐటీయూసీ తరఫున అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హాజరయ్యారు.సమ్మె నోటీసులో ప్రధాన డిమాండ్‌గా ఉన్న మెడికల్ బోర్డు అంశంపై ఏఐటీయూసీ తన వాదనలు వినిపించింది. ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డు పరీక్షల్లో కార్మికులను పారదర్శకంగా ఫిట్, అన్‌ఫిట్‌గా




ప్రకటించకపోవడంతో అనేక మందికి అన్యాయం జరిగిందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ వాదనలపై స్పందించిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్, ఈ నెల 17, 18 తేదీల్లో మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికులకు రీ-మెడికల్ పరీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని యాజమాన్యానికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావులేకుండా మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు.

సమ్మె నోటీసులో పేర్కొన్న అన్ని డిమాండ్లపై తదుపరి విచారణకు ముందే యాజమాన్యం, ఏఐటీయూసీ మధ్య ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి, చర్చల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. తదుపరి విచారణకు నిర్ణయాధికారం కలిగిన అధికారిని యాజమాన్యం తప్పనిసరిగా హాజరుపరచాలని సూచిస్తూ, విచారణను ఆగస్టు 6కు వాయిదా వేశారు.ఆగస్టు 6న జరిగే చర్చల్లో కార్మికుల సమస్యలకు సానుకూల పరిష్కారం లభించకపోతే, ఆగస్టు 16 నుంచి సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని నిరవధిక సమ్మెకు దిగుతామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, వై.వి.రావు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంతిమ సంస్కారాలకు అనేక అవస్థలు

**ఖని హిందూ స్మశాన వాటికలో శతకోటి సమస్యలు**
**సింగరేణికి నిర్వహణ అప్పగించి ఉచిత సేవలు అందించాలి**
**పూలు చల్లి వినూత్న నిరసన తెలిపిన స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

జీవితాంతం శ్రమించి చివరి ప్రయాణానికి చేరుకున్న వ్యక్తికి గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించే స్మశాన వాటికే కనీస సౌకర్యాలకు నోచుకోకపోవడం గోదావరిఖని ప్రాంత ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గోదావరి నది తీరంలో ఉన్న హిందూ స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం పూలు చల్లి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు మద్దెల దినేష్, అధ్యక్షుడు మాజీ కార్పొరేటర్ అయిత శివకుమార్, ప్రధాన కార్యదర్శి దుర్గం నగేష్, ఉపాధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ స్మశాన వాటికలో తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు, కాంపౌండ్ వాల్, మహిళలు బట్టలు మార్చుకునేందుకు కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడాల్సిన స్మశాన వాటికను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.మూడేళ్లుగా రూపాయికే అంత్యక్రియలు నిర్వహించే సేవలు నిలిపివేయడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చినప్పుడు విద్యుత్ లేకపోవడం, తాగునీటి సౌకర్యం లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శవయాత్ర వెళ్లే మార్గం సరిగా లేకపోవడం వల్ల మృతదేహాన్ని తీసుకెళ్లే వారికీ అవస్థలు తప్పడం లేదన్నారు.దాదాపు పదేళ్ల క్రితం రూ.40 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన గ్యాస్ దహన యంత్రం నేటికీ వినియోగంలోకి రాకపోవడం ప్రజాధనం వృథా కావడానికి నిదర్శనమని విమర్శించారు. ఆ యంత్రం కోసం రూ.60 లక్షలతో నిర్మించిన షెడ్డు కూడా నిరుపయోగంగా మారిందని,



కోట్ల రూపాయల ప్రజాధనం ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.స్మశాన వాటికకు ఆనుకుని ఉన్న సింగరేణి సంస్థకు చెందిన సుమారు 10 ఎకరాల ఖాళీ స్థలాన్ని స్మశాన వాటిక విస్తరణ, అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. దీంతో పార్కింగ్, అంత్యక్రియల కోసం అదనపు స్థలం, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయానికే పరిమితం కాకుండా ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. హిందూ స్మశాన వాటికను ఎప్పుడైనా సందర్శించి సమస్యలను పరిశీలించారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్మశాన వాటిక అభివృద్ధి సాధ్యం కాదని, నిర్వహణ బాధ్యతలను సింగరేణి యాజమాన్యానికి అప్పగించి ప్రజలకు ఉచిత అంత్యక్రియల సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను, జిల్లా కలెక్టర్‌ను కోరారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించకపోతే ప్రజలతో కలిసి మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల శ్రీనివాస్, కంకటి రవి గౌడ్ , కంది సుజాత, మందల రమాదేవి, గాదం సరిత లక్ష్మి, కొండు రమాదేవి, కెంపెల సుశీల , కొప్పుల శ్రీనివాస్, రామటేంకి విశ్వనాథ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ.



**అందజేసిన సర్పంచ్ సిద్ధగోని రమేష్ గౌడ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో పాఠశాలకు అవసరమైన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేవిడ్ పాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ రమేష్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు క్రికెట్ బ్యాట్లు, స్టంప్స్, బ్యాడ్మింటన్ రాకెట్లు, షటిల్‌లు, క్రికెట్ ప్యాడ్లు, హులా హూప్స్ తదితర క్రీడా వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అజిలాపూర్ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రధానోపాధ్యాయులు డేవిడ్ పాల్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని, అందుకు ఈ క్రీడా సామగ్రి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు కూడా ఈ క్రీడా వస్తువులు అందించినందుకు ఆనందం వ్యక్తం చేసి, వాటిని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, వార్డు సభ్యులు గోరంట్ల రమేష్, ఉపాధ్యాయులు , పాఠశాల చైర్మన్, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మాదిగ మహిళా సమాఖ్య జాతీయ ప్రత్యేక సమావేశం




**ఉద్యమ నిర్మాణం, మహిళల సమస్యలు, నూతన కమిటీల ఏర్పాటుపై చర్చ**

**అగ్ని ధార న్యూస్,(అమరావతి):**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) అనుబంధ విభాగమైన మాదిగ మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) జాతీయ ప్రత్యేక సమావేశం మంగళవారం విజయవాడలో ప్రారంభమైంది. ఈ సమావేశానికి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సమావేశానికి ముందు ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన భారతి మాదిగతో పాటు ఉద్యమ అమరవీరులకు మౌనం పాటించి నివాళు లర్పించారు. అనంతరం నంబూరి తబిత మాదిగ స్వాగత ప్రసంగం చేయగా, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు జేపీ లత మాదిగ అధ్యక్షత వహించారు.ఉద్యమ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, వివిధ సామాజిక వర్గాల మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేపట్టడం, జాతీయ, రాష్ట్ర స్థాయిలో నూతన కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మాదిగ మహిళా సమాఖ్య జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు, బీసీ, ఆదివాసీ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకు ముందు నిల్వ నీరు.. ఖాతాదారుల ఇబ్బందులు

**వెంటనే తొలగించాలని సీపీఐ డిమాండ్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**



గోదావరిఖని విద్యానగర్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ముందు వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం రిటైర్డ్ ఉద్యోగులతో కలిసి బ్యాంకు ఎదుట నిల్వ ఉన్న నీటిని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక బ్యాంకు ప్రవేశ ద్వారం వద్దే నిలిచిపోవడంతో ఖాతాదారులు బ్యాంకులోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు జారి పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి నిల్వ నీరు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకు అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు లక్ష్మీపతి, సుదర్శన్, బూడిద మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు జరభద్రం


**అగ్నిధార న్యూస్ కమన్పూర్**



పేరపల్లి నుండి రొంపికుంట వెళ్లే ప్రధాన రహదారిలో పోచమ్మ మూల మలుపు వద్ద గల కల్వర్టు ప్రమాద కారంగా మారింది. కల్వర్టు మీద తారు రోడ్డు బాగానే కనిపిస్తున్న కింద పైపులు కుంగి తారు కింద గల మట్టి కిందకు జారి మధ్యలో ఖాళీ స్థలం ఏర్పడింది కావున ఆ దారిలో వెళ్ళే వాహన దారులు జాగ్రత్తగా వెళ్ళగలరు అలాగే రోడ్డు మరమ్మతులు చేయడానికి కమాన్ పూర్ మండల పంచాయతీ రాజ్ ఇంచార్జి ఏఈ వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ఏఈ వరలక్ష్మి మంగళవారం వచ్చి డొల్లగా మారిన కల్వర్టు ను పరిశీలించారు. ఈ సందర్భంగా పేరపల్లి గ్రామ సర్పంచ్ బొంగోని సదయ్య, రొంపికుంట గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ లు ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకొని చుట్టు పక్కన గ్రామాల ప్రజలకు, ఆ రహదారి వెంట వెళ్లే వాహన దారులకు పలు సూచనలు చేశారు. శాఖాపరంగా అనుమతులు వచ్చి మరమ్మతులు పూర్తి అయ్యేవరకు వాహన దారులు అప్రమత్తంగా ఉండాలి అలాగే భారీ వాహనాలను ఈ దారి గుండా వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని ఇరు గ్రామాల సర్పంచ్ లు కోరారు.

# లాఠీలు పట్టని ఖాకీలు...!

## ఖాకిలకు లాఠీలు బరువా..? ఫ్రెండ్లీ పోలీసింగ్ వైపే మొగ్గుచూపుతున్నారు..! డిజిపి ఆదేశాలకే దిక్కులేదా?







**అగ్నిధారన్యూస్ ( పెద్దపల్లి జిల్లా )**

తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో ఒకప్పుడు సింహంలా గర్జించిన పోలీస్ లు.. రాను రాను పిల్లిలా మారుతున్నారా..? పుష్కర కాలానికి ముందు ఖాకీ యూనిఫాం, చేతిలో లాఠీ కనిపిస్తే చాలు నడిరోడ్డుపై అల్లరిమూకలు, దొంగలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేసే వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. కానీ నేడు సీన్ మారింది. ఫ్రెండ్లీ పోలీసింగ్ ముసుగులో ఖాకీలు తమ అసలైన ఆయుధానికి ( లాటికి సంకెళ్లు వేశారు ) పక్కన పెట్టేశారు. స్వయంగా రాష్ట్ర పోలీస్ బాస్ ( డిజిపి) రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో "పోలీసులు విధిగా లాఠీ ధరించాలి" అని ఆర్డర్ వేసినా.. క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. లాఠీ లేని ఖాకీని చూసి జనం భయపడటం మానేశారు...! అసలు పోలీసులకు లాఠీ మోయడం బరువైందా..? లేక ఫ్రెండ్లీ పోలీస్ విధానం పోలీసుల చేతులకు సంకెళ్లు వేసిందా....?

### డిజిపి ఆదేశాలు భేఖాతర్.. ఖాకీల నిర్లక్ష్యం!

శాంతిభద్రతల పరిరక్షణలో లాఠీ అనేది కేవలం ఒక కర్ర కాదు, అదొక పవర్ సింబల్. నడిరోడ్డుపై గొడవలు జరిగినా రాజకీయ నాయకులు ధర్నాలు రాస్తారోకోలు చేసిన, ట్రాఫిక్ జామ్ అయినా, ఆకతాయిలు రెచ్చిపోయినా లాఠీ ఝుళిపిస్తేనే పరిస్థితి అదుపులోకి వస్తుంది. అందుకే సిబ్బంది అంతా లాఠీలతోనే డ్యూటీ చేయాలని డిజిపి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. పెద్దపల్లి కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల నుంచి బయటకు వచ్చే కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ ఐ ఉన్నతాధికారు వరకు సిబ్బంది చేతుల్లో లాఠీల ఊసే లేదు. ఉన్నతాధికారుల ఆర్డర్లను కిందిస్థాయి సిబ్బంది లైట్ తీసుకోవడం ఇప్పుడు, ప్రజల్లో పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా పెద్దపల్లి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తమ కిందిస్థాయి సిబ్బందికి విధిగా లాఠీ పట్టాలని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

### ఫ్రెండ్లీ పోలీసింగ్ తో.. పెరిగిన బరితెగింపు!

జనానికి దగ్గరవ్వాలి, ఫ్రెండ్లీగా ఉండాలి అనే గత ప్రస్తుత ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ అది కాస్తా ఇప్పుడు పోలీసుల ఆత్మరక్షణకే ముప్పుగా మారుతోంది. పోలీసులంటే భయం పోయింది: చేతిలో లాఠీ లేని పోలీసును చూసి దొంగలు, గంజాయి మూకలు, పేకాట రాయుళ్లు, సంఘవిద్రోహులు, రౌడీ షీటర్లు, జులాయిలు, హేళనగా చూస్తున్నారు.

### పోలీసులపైనే దాడులు:

ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న వారిని మందలించడానికి వెళ్లిన పోలీసులపైనే ఎదురుదాడులు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి.

### కంట్రోల్ తప్పిన జనం:

గొడవలు జరిగినప్పుడు రాజకీయ పార్టీల ధర్నాలు రాస్తారోకోలు చేసినప్పుడు, నచ్చజెప్పడానికి పోలీసులు ప్రయత్నిస్తుంటే, జనం ఫ్రెండ్లీ పోలీసులను లెక్క చేయడం లేదు. పోలీసుల చేతిలో లాఠీ ఉంటే వచ్చే ఆ 'భయం, భక్తి' ఫ్రెండ్లీ పోలీస్ మాటలతో రావడం లేదనేది పచ్చి నిజం.

### 'ఫ్రెండ్లీ' పోలీస్ ముసుగులో లాఠీలకు సంకెళ్లు ...సోషల్ మీడియా ట్రోలింగ్

కిందిస్థాయి సిబ్బంది కూడా ఫ్రెండ్లీ పోలీసింగ్ వైపే మొగ్గు చూపడానికి కొన్ని బలమైన కారణాలు ఉన్నాయి.

పొరపాటున లాఠీ తీస్తే చాలు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెడతారని భయం. కేసుల భయం మానవ హక్కుల కమిషన్లు, కోర్టుల చుట్టూ తిరగడం మాకెందుకనే ఉద్దేశంతో పోలీసులు నిరాయుధులుగా మిగిలిపోతున్నారు.

### చేతులు కట్టేసిన విధానం:

నిస్సహాస్థితిలో ఈ ఫ్రెండ్లీ విధానం పోలీసుల చేతిలోని లాఠీలకు సంకెళ్లు వేసింది. పోలీస్ వ్యవస్థ పవర్ కోల్పోయేలా చేస్తోంది. ఏది ఏమైనా ఖాకీ పవర్ కోల్పోకూడదు..! ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది బాధితులకు న్యాయం చేయడంలో చూపించాలి. చట్టాన్ని తమ పలుకుబడితో చేతుల్లోకి తీసుకునే, దొంగలు, క్రిమినల్స్, సంఘవిద్రోహుల ముందు కాదు... క్రమశిక్షణను కాపాడటంలో పోలీస్ చేతిలో లాఠీ పాత్ర అమూల్యమైనది. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆదేశాలను గౌరవించి, ప్రతి పోలీస్ చేతిలో మళ్లీ లాఠీ ఉంటేనే సమాజంలో శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. పోలీసులకు గౌరవం ఉంటుంది. ఖాకీలు తమ పవర్‌ను నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..! లేదు ఫ్రెండ్లీ పోలీసు మాకు ఇష్టం ఇలాగే కొనసాగుతాం అంటే...? రాబోయే రోజుల్లో పోలీసులు కీలుబొమ్మలుగా మారుదు కాయమనేది సర్వత్ర వినిపిస్తున్న నగ్నసత్యం.

# గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సిపి




**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ వార్షిక తనిఖీల్లో భాగంగా గజ్వేల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సిబ్బంది గార్డ్ ఆఫ్ ఆనర్ సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ సిపి పరిశీలించారు. పోలీస్ స్టేషన్ కాంపౌండ్ వాల్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా వేసిన చిత్రాలను పరిశీలించి అభినందించారు. అలాగే స్టేషన్ ప్రాంగణాన్ని వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను తనిఖీ చేశారు. సిబ్బంది శారీరక దారఢ్యం, మానసిక ఉల్లాసం కోసం పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్ట్‌ను కమిషనర్ ప్రారంభించారు. పోలీస్ సిబ్బందికి కేటాయించిన కిట్ ఆర్టికల్స్‌ను, యూనిఫాం ప్రమాణాలను పరిశీలించారు. ఆ తర్వాత స్టేషన్‌లోని రికార్డులు, వర్తమాన దర్యాప్తులో ఉన్న కేసులు మరియు తీవ్రమైన నేరాల వివరాలను క్షుణ్ణంగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. పగలు, రాత్రి బీట్ విధులలో భాగంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను ఫింగర్‌ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీ చేసి, పాత నేరస్తులను గుర్తించాలని సూచించారు. సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాలలో సీసీటీవీ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి గ్రామాలలో సీసీటీవీలు అమర్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సిద్దిపేట్ పోలీస్ ఉద్యోగమిత్ర ఆన్లైన్ పోర్టల్ గురించి ప్రతి గ్రామంలో యువతకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాలలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సిబ్బంది ప్రతి ఒక్కరూ అన్ని రకాల విధులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న పనితీరు మీ సేవా కాలమంతా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై, వారి సమస్యలు పనితీరుపై చర్చించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమం చివరలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో సిపి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, గజ్వేల్ టౌన్ ఇన్స్పెక్టర్ రవికుమార్, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

## సారనాథ్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా



**బుద్ధుని తొలి ధర్మచక్ర ప్రవర్తన క్షేత్రానికి విశ్వగౌరవం**
**ప్రపంచ బౌద్ధుల్లో హర్షం.. త్రిపిటక పారాయణం, ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు**

**అగ్ని ధార న్యూస్ (వారణాసి):**

ఉత్తరప్రదేశ్‌లోని బౌద్ధుల అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన లిసారనాథ్ (జింకలవనం)లికు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు లభించింది. తథాగతుడు గౌతమ బుద్ధుడు బోధి వృక్షం కింద జ్ఞానోదయం పొందిన అనంతరం తన తొలి ధర్మబోధన చేసిన ఈ చారిత్రక స్థలానికి అంతర్జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపుపై ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుద్ధుడు తన ఐదుగురు శిష్యులకు మొదటిసారిగా ధర్మచక్ర ప్రవర్తన బోధించిన పవిత్ర ప్రదేశమే సారనాథ్. ఇక్కడ ధమేక్ స్తూపం, చౌఖండి స్తూపం, అశోక సింహస్తంభం, పురాతన బౌద్ధ విహారాలు, చారిత్రక అవశేషాలు బౌద్ధ వారసత్వానికి చిరస్మరణీయ చిహ్నాలుగా నిలిచాయి. ప్రతి ఏడాది ప్రపంచంలోని అనేక దేశాల నుంచి వేలాది మంది బౌద్ధ యాత్రికులు, విదేశీ పర్యాటకులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తుంటారు. యునెస్కో గుర్తింపు నేపథ్యంలో బుద్ధగయకు చెందిన ఆల్ ఇండియా భిక్షు సంఘం ఆధ్వర్యంలో, భారతీయ బౌద్ధ మహాసభ సహకారంతో సారనాథ్‌లో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భిక్షువులు పవిత్ర త్రిపిటకాల పారాయణం నిర్వహించగా, రాజస్థాన్‌కు చెందిన ఐదు కుటుంబాలు స్వచ్ఛందంగా బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాయి. అనంతరం భిక్షువులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ప్రముఖ బౌద్ధ భిక్షువు భంతే సత్యబోధి పాల్గొని బుద్ధుని శాంతి, కరుణ, సమానత్వ సందేశాన్ని వివరించారు. యునెస్కో గుర్తింపు బౌద్ధ వారసత్వ పరిరక్షణకు మరింత బలాన్నిస్తుందని ఆయన పేర్కొన్నారు.

కళింగ యుద్ధం అనంతరం అహింసా మార్గాన్ని స్వీకరించిన మౌర్య చక్రవర్తి అశోకుడు సారనాథ్ అభివృద్ధికి విశేష కృషి చేసి బౌద్ధ ధర్మ ప్రచారానికి పునాది వేశారని బౌద్ధ పండితులు గుర్తుచేశారు. నాటి అశోకుని ఆశయాలకు నేటి యునెస్కో గుర్తింపు ప్రపంచవ్యాప్త గౌరవాన్ని తీసుకువచ్చిందని వారు అభిప్రాయపడ్డారు.

## కమాన్‌పూర్‌లో అత్యధికంగా 59.8 మి.మీ. వర్షపాతం నమోదు




**అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్**

పెద్దపల్లి జిల్లాలో మంగళవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవగా, కమాన్‌పూర్ మండలంలో అత్యధికంగా 59.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆ తర్వాత పెద్దపల్లి మండలంలో 52.4 మి.మీ., పాలకుర్తి మండలంలో 52.2 మి.మీ., మంథని మండలంలో 43.6 మి.మీ., శ్రీరాంపూర్‌లో 38.0 మి.మీ., జూలపల్లి మండలంలో 34.6 మి.మీ., రామగుండం మండలంలో 29.2 మి.మీ., ఎలిగేడు మండలంలో 28.8 మి.మీ., సుల్తానాబాద్‌లో 26.2 మి.మీ., అంతర్గాం మండలంలో 22.6 మి.మీ., ఓదెల మండలంలో 19.6 మి.మీ., రామగిరి మండలంలో 18.4 మి.మీ., ధర్మారం మండలంలో 14.6 మి.మీ., ముత్తారం (మంథని) మండలంలో 14.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకోవాలి




**లేకుంటే కలెక్టరేట్ ఎదుట మళ్లీ ధర్నా: ఊట్ల శ్రీను**

**అగ్నిధార న్యూస్ (ముత్తారం):**

ముత్తారం మండలం పోతారం గ్రామంలోని 59, 113 సర్వే నంబర్ల భూములకు సంబంధించిన అక్రమ పట్టాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత నెల 25న నిర్వహించిన ప్రజావేదికలో జిల్లా కలెక్టర్ అక్రమ పట్టాలను రద్దు చేసి, ప్రభుత్వాన్ని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

అయితే నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. అక్రమ పట్టాల ద్వారా ప్రభుత్వానికి నష్టం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రకటించిన మేరకు సంబంధిత అధికారుల ద్వారా చర్యలు చేపట్టకపోతే కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మళ్లీ ధర్నా చేపడతామని ఊట్ల శ్రీను హెచ్చరించారు.

## అనర్హులకు డబుల్ బెడ్ రూములు ఇస్తున్నారు

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**హైదరాబాద్ :** డబుల్ బెడ్ రూంలు నిరుపేదలకు ఇవ్వకుండా మంత్రుల కలెక్టర్ల అనుచరులను ఇవ్వడంపై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. దేశంలో ప్రజలను నిత్యం మోసం చేసే పార్టీనే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం

# ఓటరు జాబితా డిజిటలైజేషన్‌లో కల్వకుర్తి రూరల్‌కు తొలి స్థానం

**8 నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసిన తొలి మండలం**

**బిఎల్ఓలను అభినందించిన తహశీల్దార్ ఇబ్రహీం**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి, ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో కల్వకుర్తి నియోజకవర్గం విశేష విజయాన్ని నమోదు చేసుకుందని కల్వకుర్తి తహశీల్దార్ ఎం.డి. ఇబ్రహీం తెలిపారు. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో కల్వకుర్తి రూరల్ మండలం 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసి తొలి స్థానంలో నిలవడం విశేషమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయడంలో మండల రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన మండల కార్యాలయ సిబ్బంది, అన్ని గ్రామాల బీఎల్వోలు, బీఎల్వో సూపర్వైజర్లు, బీఎల్ఏలు, గ్రామస్థాయి నాయకులు, జీపీవోలతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. ఓటరు జాబితాను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో



రూపొందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయడం వల్లే 100 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయగలిగామని తహశీల్దార్ వివరించారు. భవిష్యత్తులో కూడా ఇదే నిబద్ధత, సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో,రెవెన్యూ అధికారులు వీఆర్వో లు బీ ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రిని పరామర్శించిన స్థానిక ఎమ్మెల్యే



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

గత కొన్ని రోజుల క్రితం స్వస్థతకు గురై అనారోగ్యంతో బాధపడుతున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్ దాస్ నీ కల్వకుర్తి పట్టణంలో నీ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన తో పాటు పి సి సి సభ్యులు శ్రీనివాస్ గౌడ్,కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్,మట్ట వెంకటయ్య గౌడ్,మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి,మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాహూల్,తదితరులు పాల్గొన్నారు.

## దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి సేవలు మరువలేనివి



**చిత్ర పటానికి నివాళులర్పించిన మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

మాజీ కేంద్రమంత్రి దివంగత సూదిని జైపాల్ రెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకుని తల కొండపల్లి పట్టణ కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ పట్టం కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ప్రజాసేవ చేసిన అరుదైన నాయకుడు జైపాల్ రెడ్డి అని కొనియాడారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఆయనకున్న ప్రత్యేక గుర్తింపు, ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ మరియు ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జలసిరి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని లింగారావుపల్లి గ్రామ పంచాయతీతో పాటు గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణాపూర్ ఆవాసంలో జలసిరి ప్రత్యేక గ్రామసభలను నిర్వహించినట్లు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమం ద్వారా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి వృథా నివారణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, ఫార్మ్ పాండ్ల నిర్మాణం, రూఫ్‌టాప్ రేన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.ప్రతి కుటుంబం నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈకార్యక్రమం లో, గ్రామ సర్పంచ్ శ్రీ కాసు శ్రీనివాస్ రెడ్డి పి ఎ సి ఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి ఉప సర్పంచ్ సర్పంచ్ బూత్కూరి వెంకట్ రెడ్డి, సి సి దీప టి ఎలతారని పంచాయతీ కార్యదర్శి మహేష్ వార్డు సభ్యులు భాగ్య శ్రీజ సురేందర్ రెడ్డి శేఖర్ శివలింగం సుమన్ మరియూ రాములు సాత్విక మమతా మహిళా సంఘాల సభ్యులు రైతులు గ్రామ పెద్దలు యువకులు గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు గ్రామపంచాయతీ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మొక్కలు పంపిణీ



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో వన మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, యువతకు, విద్యార్థులకు వివిధ రకాల మొక్కలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ,పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో, ఉపసర్పంచ్ నిజాముద్దీన్, పంచాయతి కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు మాయని సుమంత రాజశేఖర్, పర్వత రెడ్డి, సికిందర్, అక్షయ విశ్వేశ్వర్, ఆదిరాల యాదయ్య, బిజినపల్లి స్వాతి బాల్ రాజ్,అనురాధ జంగయ్య, కంకల అలివేల జంగమయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై అఖిలపక్ష సమావేశం



**నిర్వహించిన ఆర్డీఓ జనార్ధన్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆర్డిఓ జనార్ధన్ రెడ్డి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, తప్పులు లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్ ఇబ్రహీం, అధికారి రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డొక్క లింగమయ్య,తది తరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ బోరు పైపులు అప్పజెప్పిన ఆలయ నిర్వాహకులు



**కార్యదర్శికి అందజేసిన ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ మూర్తి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండ పల్లి మండలం వెల్ జాల్ గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు పైపులు. అత్యవసర సమయంలో. వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి అవసరం నిమిత్తం ఆలయ నిర్వాహకులు. గత సంవత్సరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ని అడిగి తీసుకున్నారు. ఇట్టి పైపులు ఆలయ నిర్వాహకులు గ్రామ పంచాయతీ కార్యదర్శి కి నూతనంగా కొత్త పైపులు కొనుగోలు చేసి తిరిగి గ్రామ పంచాయతీ కి అప్పజెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాస మూర్తి. మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి. మాజీ సింగిల్ విండో చైర్మన్ అయిలు అంజయ్య గౌడ్. మాజీ ఉప సర్పంచు లు బోయ నర్సింహ. ఎండి అజీజ్. పి అశోక్ బాబు. లింగం యాదవ్. మల్లేష్. కల్వకోలు యాదగిరి. తిరుమణి రాఘవేందర్ గౌడ్. తిరుమణి కృష్ణయ్య గౌడ్. వద్దె రాజు. పులి జాల విష్ణు. తదితరులు పాల్గొన్నారు

## రైతులకు నీటి వనరుల సద్వినియోగం, శాస్త్రీయ సాగు విధానాల పై సూచనలు, సలహాలు




**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ జగదేవపూర్ మండలంలోని జగదేవ పూర్ మునిగడప రైతు వేదికలలో నేడు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని రైతులు, వ్యవసాయ అధికారులు ఉత్సాహంగా వీక్షించారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు ఎల్-నినో ప్రభావం, వానాకాలం-2026లో ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, వాతావరణ పరిస్థితులు, నీటి వనరుల సద్వినియోగం, శాస్త్రీయ సాగు విధానాలు వంటి అంశాలపై విలువైన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ విస్తరణ అధికారులు కృషి సఖులు, సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.అనంతరం జగదేవపూర్ రైతు వేదికలో కొనసాగుతున్న విత్తన మేళా ను రైతులు సందర్శించి, కంది విత్తనాలను కొనుగోలు చేశారు. ఎల్-నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న విత్తన మేళాకు రైతుల నుంచి మంచి స్పందన లభించింది.వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణను అవలంబించి, వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని కోరారు.

## బాధిత ?కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్



**మృతుని కుటుంబానికి 5 వేలు ఆర్థిక సాయం.**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మండలం అలీరాజాపేట్ గ్రామానికి చెందిన మాదాను బాలస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరితో కలుపుకొని గా ఉండే బాలస్వామి అనారోగ్యం భారిన పడి మృతి చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని కలగజేయాలని ఆయన కోరారు.ఆయన వెంట ?గోవిందు, పాల్ జ్యోతి, జోజప్ప, కందుకూరి మల్లేష్, రాచమల్ల నరసింహులు కర్రే శ్రీనివాస్ మలకపేట తిరుపతి, పండుగ మహేష్, జోసెఫ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ.



**అందజేసిన సర్పంచ్ సిద్దగోని రమేష్ గౌడ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలోని అజిలాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో పాఠశాలకు అవసరమైన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేవిడ్ పాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ రమేష్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు క్రికెట్ బ్యాట్లు, స్టంప్స్, బ్యాడ్మింటన్ రాకెట్లు, షటిల్‌లు, క్రికెట్ ప్యాడ్లు, హూలా హూప్స్ తదితర క్రీడా వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అజిలాపూర్ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రధానోపాధ్యాయులు డేవిడ్ పాల్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని, అందుకు ఈ క్రీడా సామగ్రి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు కూడా ఈ క్రీడా వస్తువులు అందించినందుకు ఆనందం వ్యక్తం చేసి, వాటిని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, వార్డు సభ్యులు గోరంట్ల రమేష్, ఉపాధ్యాయులు , పాఠశాల చైర్మన్, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర మంత్రిగా దగ్గుబాటి పేరు...

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యా శాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. విద్యావ్యవస్థలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేశారు. ఇందులో యాదృచ్ఛికం ఏంటంటే.. స్వతహాగా విద్యార్థి నాయకుడిగా ఉండేవారు ధర్మేంద్ర ప్రధాన్. ఇప్పుడు అదే విద్యార్థి లోకం ఆందోళనల ఫలితంగా పదవికి దూరమయ్యారు. ఈ విషయాన్ని పక్కన పెడితే ఇప్పుడు తదుపరి కేంద్ర విద్యా శాఖ మంత్రి ఎవరు అనే చర్చ బలంగా నడుస్తోంది. అయితే ఈసారి సమర్థులకు అవకాశం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారు. క్యాబినెట్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఏపీ నుంచి ఈసారి అవకాశం ఉంటుంది అనేది ప్రధానంగా జరుగుతున్న చర్చ. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఆమె క్యాబినెట్లో పనిచేసిన అనుభవం ఉండడంతో ఆమె వైపు మోది మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది.

# పదవ రోజు భక్తిశ్రద్ధల మధ్య శ్రీకృష్ణ కాలచక్రం విశ్వశాంతి మహాయాగం

**యాగాలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన పాఠశాల విద్యార్థులు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



కల్వకుర్తిలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ కాలచక్రం 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య పదవ రోజు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారి దివ్య మంగళ శాసనాల మేరకు నిర్వహిస్తున్న ఆయుధ చండీ, అతిరుద్ర మహాయాగంలో భాగంగా పలు విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు మన్యుసూక్త హోమము కుజ దోష నివారణ హోమము సుబ్రహ్మణ్య స్వామి వారికి అభిషేక అర్చన హోమములు సరస్వతి పూజలు హోమములు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమశీలో పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. వారితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హోమము లో పాల్గొన్న అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్వామీజీ విద్యార్థులను ఆశీర్వదించడం జరిగింది. అని నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు అన్నారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ వల్లి దేవ సేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని విశ్వశాంతి, లోకక్షేమం, కుటుంబ సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేశారు. ప్రతిరోజు నిత్య అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతుండటంతో భక్తులు అన్నా దాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు అనంతరం భోజనాలు స్వీకరించడం జరిగింది. ఈ మహాయాగ మహోత్సవాలు మరికొన్ని రోజుల పాటు కొనసాగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు జూలూరి రమేష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో, ఆర్య వైశ్య సంఘం నాయకులు రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, సురేష్, దారమోని గణేష్, ఆలయ కమిటీ నిర్వాహకులు ఆర్యవైశ్య సంఘం నాయకులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశ్నించే వారే చరిత్ర సృష్టిస్తారు






**కొత్తపల్లి రవి పిడిఎస్ యు మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి**
**కాంపాటి పృథ్వీ పి.డి.యస్.యు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు.**

**అగ్నిధారన్యూస్ వరంగల్**

పాలకులు సృష్టించే అనైక్యత, దోపిడీ మూలాలను ప్రశ్నించే విద్యార్థులే చరిత్ర సృష్టిస్తారని పి డి యస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మహబూబాబాద్ పట్టణం దుస్సా చేరాలు నగర్ (టి పి టి ఎఫ్ జిల్లా కార్యాలయం ) లో పి.డి.యస్.యు. మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా విద్యా, వైజ్ఞానిక తరగతుల లో కొత్తపల్లి రవి ప్రారంభ ఉపన్యాసం చేశారు. తరగతుల ప్రారంభానికి ముందు పి డి యస్ యూ బిగి పిడికిలి జెండా ను పి డి యస్ యూ జిల్లా కార్యదర్శి గౌతమ్ ఎగురవేశారు. అనంతరం ప్రారంభమైన విద్యా వైజ్ఞానిక తరగతులలో పాల్గొని మాట్లాడుతూ... నేడు దేశంలో వెయ్యి ఏనుగుల బలం కలిగిన బిజెపి ఎవరు ఏమి చేయలేరని విర్రవీగిన మోడీ ప్రభుత్వానికి డిల్లీ లో విద్యార్థుల ఉద్యమం సవాలుగా మారి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయించి మోడీ ప్రభుత్వాన్ని మోకాళ్లపై కూర్చోబెట్టి భారత సమాజానికి క్షమాపణలు చెప్పించిన చరిత్ర మన కండ్ల ముందే కనబడిందని అన్నారు. అందుకే ప్రశ్నించే విద్యార్థులే చరిత్ర సృష్టిస్తారని ఆయన తెలిపారు. జిల్లా రాజకీయ శిక్షణ తరగతులలో పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ పి.డి.ఎస్.యు."నిర్మాణం- పని విధానం" అనే క్లాస్ ను బోధించారు. త్వరలో స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదలకై విద్యార్థి లోకం ఢిల్లీ తరహా ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సంఘటిత శక్తికి ఎలాంటి నిరంకుశ ప్రభుత్వం అయినా తలవంచక తప్పదని అన్నారు. పి.డి.యస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు "పి.డి.ఎస్.యు. చరిత్ర" క్లాస్ ను బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలలో పి.డి.యస్.యు. చరిత్ర రక్తాక్షరాలతో లిఖించదగిందని, వందలాది మంది విప్లవ విద్యార్థి నేతల మరణంతో విద్యార్థి ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసాయని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి. యస్.యు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందీశ్వర్,గౌతమ్ జిల్లా నాయకులు రాచకొండ ఉదయ్ ,ప్రవీణ్, తరుణ్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ ప్రవేశాలకు దరఖాస్తులు

**జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద.**


**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూలై - 28:**



నవోదయ విద్యాలయ సమితి, విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో 2027--28 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్ 2027కు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారదమంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గంగాధర, హుజూరాబాద్, కరీంనగర్, మహదేవ్‌పూర్, మంథని, పెద్దపల్లి, సిరిసిల్ల, సుల్తానాబాద్, వేములవాడబ్లాకుల్లో ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే జవహర్ నవోదయ విద్యాలయం, కరీంనగర్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

ఈ విద్యా సంవత్సరం నుంచి జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, మల్యాల, మెట్‌పల్లి బ్లాకుల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు సంబంధిత జవహర్ నవోదయ విద్యాలయం, జగిత్యాలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయ సెలెక్షన్ టెస్ట్ 2027ను 2026 నవంబర్ 28 (శనివారం) నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు 2026 జూలై 31వరకు ఎలాంటి రుసుము లేకుండా https://navodaya.gov.inలేదా https://cbseitms.rcil.gov.in/nvs/వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తుకు అవసరమైన ధ్రువపత్రాలు, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాల కోసం సంబంధిత జవహర్ నవోదయ విద్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు రేపు భారీ వర్షాలు
## . జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, జూలై - 28:**

వాతావరణ నిపుణులు, క్లైమటాలజిస్టులు అందించిన నివేదికల ప్రకారం పెద్దపల్లి జిల్లాలో 2026 జూలై 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు,కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కంది, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు, అలసంద, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు వంటి పంటలను సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు విత్తనాలు వేసేందుకు అత్యంత అనుకూల సమయమని, జిల్లా కలెక్టర్ సూచించారు. సకాలంలో విత్తనాలు వేయడం వల్ల నేలలో తగినంత తేమ లభించి పంటలు ఆరోగ్యంగా ఎదిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఆగస్టు 10 వరకు మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ అవి చెరువులు నిండేందుకు, భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపయోగపడవని, వీటిని నమ్ముకుని వరి వంటి పంటలు వేస్తే రైతులు దెబ్బతింటారని ఆరుతడి పంటల సాగుకే రైతులు మొగ్గు చూపాలని కలెక్టర్ సూచించారు.

రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ఈ అనుకూల వర్షాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## చికిత్స కోసం ఎల్ ఓ సి అందజేత

**లక్ష ఎల్ ఓ సి మంజూరు చేయించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు.**

**అగ్నిధారన్యూస్ మంథని**

తెలంగాణ రాష్ట్ర ఐటి పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గం లోని రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన నక్క నరేష్ కు 1,00,000 ఎల్ ఓ సి మంజూరు చేసి ఇప్పించారు. -మంథని నియోజకవర్గం రామగిరి మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన నక్క నరేష్ అనారోగ్య కారణంగా వైద్య చికిత్సకు సంబంధించిన ( 1,00,000 ఎల్ ఓ సి) నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి తెలుపగా వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ 1,00,000 లక్ష ఎల్ ఓ సి మంజూరు చేయించి, మంత్రి ఆస్పత్రి సహాయకుల ద్వారా హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందచేయడం జరిగింది.



## జైపాల్ రెడ్డి సేవలు భారత దేశంలో చిరస్మరణీయం




**వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ శ్రీ ఎస్. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఆయన సమాధి వద్ద ఆ మహనీయునికి ఘనంగా నివాళు లర్పిశీచిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరాడంబర రాజకీయ నాయకుడిగా, అసాధారణ వాగ్ధాటితో కూడిన పార్లమెంటేరియన్‌గా, ప్రజాస్వామ్య విలువలకు అంకితభావంతో సేవలందించిన నాయకుడిగా జైపాల్ రెడ్డి చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరడంలో కీలక పాత్ర పోషించిన జైపాల్ రెడ్డి కేంద్ర మంత్రిగా వివిధ శాఖల్లో ఆయన అందించిన సేవలు, దేశాభివృద్ధి పట్ల చూపిన నిబద్ధత, ప్రజా సమస్యలపై ఆయనకున్న లోతైన అవగాహన ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ప్రజాసేవా స్ఫూర్తి, రాజకీయ విలువలు, ప్రజాహితానికి అంకితమైన వారి జీవితం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, యాచారం వెంకటేశ్వర్లు,బ్లాక్ కాంగ్రెస్ అయక్షుడు యట నరసింహా,సాయిరెడ్డి,సుదర్శన్ రెడ్డి,తది తరులు పాల్గొన్నారు.

## సూదిని జైపాల్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



**7వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

మాజీ కేంద్రమంత్రి దివంగత సూదిని జైపాల్ రెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకుని కొత్త చౌరస్తాలో విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారయణ రెడ్డి మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ప్రజాసేవ చేసిన అరుదైన నాయకుడు జైపాల్ రెడ్డి అని కొనియాడారు. పార్లమెంటరీ వ్యవస్థలో ఆయనకున్న ప్రత్యేక గుర్తింపు, ప్రజాస్వామ్య పరిరక్షణకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్,మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి,హరికిషన్ రెడ్డి,సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

హైదరాబాదులోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యేను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అలవ్వెంకటేశ్వర్ రెడ్డి తో కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## పోలీస్ స్టేషన్ తరలించే ప్రయత్నం ఎమ్మెల్యే మానుకోవాలి

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గణేష్ రావు**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ వంగూరు మండల కేంద్రంలో సమికృత భవనాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయడం జరిగింది అని మండల కేంద్రంలో నిర్మించాల్సిన పోలీస్ స్టేషన్ ను వంగూరు గేట్ మీద నిర్మాణం చేపట్టెందుకు సోమవారం స్థల పరిశీలన చేయడం అంటే వంగూరు గ్రామ అభివృద్ధికి అడ్డుపడుతున్నారనీ గణేష్ రావు అన్నారు వంగూరు మండల కేంద్రం లో ఉండాల్సిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఈ విదంగా తరలించాడన్ని కండిస్తూ వంగూరు లో అన్ని రాజకీయ పక్షాలు రాజకీయాలకు అతీతంగా యువజన సంఘాలు అందరు కలిసి ఈ నిర్ణయాన్ని విరామించుకోవాల్సిందిగా నేడు ఉదయం 10 గంటలకు వంగూరు గ్రామ పంచాయతీ దగ్గర నుండి కలిసి ఇక్కడి నుండి తహసీల్దార్ కార్యాలయం దగ్గరికి వెళ్లి కి ఈ విషయం అందరి తరుపున ఒక వినతి పత్రాన్ని ఇచ్చి ఈ నిర్ణయం విరామించుకునే వరకు అందరం ఉద్యమించాల్సిన అవసరం ఉంది అని గణేష్ రావు అన్నారు కాబట్టి వంగూరు అభివృద్ధి కోరుకొనే ప్రతి ఒక్కరు అందరు నేడు ఉదయం10గంటలకు వంగూరు గ్రామపంచాయతీ దగ్గరికి రాగలరని బిఆర్ఎస్ పార్టీ నాయకులు గణేష్ రావు తెలిపారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com